క్లుప్తంగా

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోండి



భీమారంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్

భీమారం/చెన్నూర్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు సూచించారు. పలు మండల కేంద్రాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. భీమారంలో ఒక్క దరఖాస్తు రాగా ఎంపీడీవో శ్రీనివాస్ స్వీకరించారు. చెన్నూర్‌లో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో విద్యార్థి సంఘాల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను ఖండిస్తూ సోమవారం మంచిర్యాలలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల బాధ్యులు శ్రీనివాస్, శివతేజ, ప్రవీణ్, అభిరామ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భీమిని: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సోమవారం కన్నెపెల్లి మండల కేంద్రంలో నేతకానీ సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోమాస దాగయ్య, దుగుట చంద్రయ్య, రాములు, దేవాజీ, లక్ష్మణ్, రాజశేఖర్, శ్రీనివాస్, బాపు తదితరులు పాల్గొన్నారు.

'వార్డుమెంబర్ జ్యోతి' షార్ట్‌ఫిల్మ్‌కు ప్రశంస

మందమర్రిరూరల్: ఎన్టీపీసీలో క్లాసిక్ గార్డెన్‌లో ఈ ఇండియా రైజింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్తమ యూట్యూబ్ షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో మందమర్రికి చెందిన కాసిపేట స్వామికి గుర్తింపు లభించింది. కాసిపేట స్వామి తీసిన 'వార్డు మెంబర్ జ్యోతి' షార్ట్‌ఫిల్మ్‌కు గుర్తింపు లభించడంతో ఫౌండేషన్ నిర్వాహకులు మనోహర్ సీరియల్‌లోని కథానాయకులైన స్వామి, రాధను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు.

క్వార్టర్స్ కేటాయింపు కోసం కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏరియా ఎగ్జిక్యూటీవ్స్‌కి 10క్వార్టర్లకు కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించగా, ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. వారికి అధికారులు క్వార్టర్ అలాట్ చేసారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసీఫ్, ఆఫీస్ ఓఎస్ రాజలింగు తదితరులు ఉన్నారు.

కొండచిలువ కలకలం



మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేటలో ఆటో డ్రైవర్ అంజయ్య ఇంటి సమీపంలో కొండచిలువ సంచారం కలకలం రేపింది. అంజయ్య స్థానికులకు సమాచారం అందించగా, వారు అప్రమత్తమై కొండచిలువను కొట్టి చంపారు. గ్రామం పక్కనే అటవీప్రాంతం ఉండడంతో విష సర్పాల సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

వీఆర్‌ఏల సంబురాలు



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నెన్నెల/వేమనపల్లి/దండేపల్లి/తాండూర్: వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ, ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో పలు మండలాల్లో వీఆర్‌ఏలు సోమవారం సంబురాలు నిర్వహించారు. కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. నెన్నెల, వేమనపల్లి, దండేపల్లి, తాండూర్ మండలాలకు చెందిన అన్ని గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

భయం.. భయం!

జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉన్నాయి. దశాబ్దాల నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీటి నిర్వహణపై ప్రభుత్వ యంత్రాంగం సరిగ్గా దృష్టి సారించకపోవడంతో క్రమంగా పతనావస్థకు చేరుకుంటున్నాయి. వర్షాకాలం శ్లాబులు ఉరుస్తున్నాయి. పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వశాఖల కార్యాలయాలను సోమవారం 'సాక్షి' బృందం సందర్శించి దుస్థితిని గుర్తించింది. విజిట్‌లో అధ్వానంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు వెలుగులోకి వచ్చాయి.



శిథిలావస్థకు చేరిన చంద్రవెల్లి గ్రామపంచాయతీ కార్యాలయ భవనం

సాక్షి విజిట్

- జిల్లాలో పలుచోట్ల శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలు
- వర్షాలకు పెచ్చులూడి ఉరుస్తున్న శ్లాబులు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది
- పక్కా భవనాలపై దృష్టి సారించని ప్రభుత్వ యంత్రాంగం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో మండల తహసీల్దార్ కార్యాలయం సింగరేణి భవనంలో కొనసాగుతోంది. ఆ భవనం పై కప్పు పెచ్చులు ఊడి దిన దినం శిథిలావస్థకు చేరుతోంది. బెల్లంపల్లి మండలంలో చంద్రవెల్లి, మాల గురిజాల, అంకుశం, చాకేపల్లి, దుగ్నేపల్లి, గురిజాల గ్రామపంచాయతీల భవనాలు ఏటా వర్షాకాలంలో ఉరుపులతో తడిసి ముద్దవుతున్నాయి. గోడలు నీటితో తడుస్తూ పడిపోయేలా ప్రమాదకరంగా తయారవుతున్నాయి. చంద్రవెల్లి గ్రామపంచాయతీ భవనం పై కప్పుకు తాజాగా రంధ్రం పడింది.

- తాండూర్‌లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. కంప్యూటర్, కార్యదర్శులు ఉండే గది బీటలు వారి వర్షానికి నీళ్లు కిందికి జారుతున్నాయి. మెయిన్‌హాల్, సీనియర్ అసిస్టెంట్ ఉండే గది వరండా పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. రికార్డులు తడుస్తున్నాయి. తహసీల్ కార్యాలయంలో కొన్ని రోజుల క్రితం ధరణీ లావాదేవీలు జరిపే గదిలో శ్లాబ్ పెచ్చులు ఊడి కింద పడ్డాయి. తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి.
- నెన్నెలలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ ఉరుస్తుంది. గోడలకు పదును వస్తోంది. రికార్డులు, మందులు తడిసి ముద్దైపోతున్నాయి. కూలిపోయిన దశలో ఉన్న కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. 30సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీహాల్‌లోనే పశువైద్యశాల కొనసాగుతోంది. గతంలో నూతన భవనం మంజూరైనప్పటికీ స్థల సమస్యతో నిర్మాణానికి నోచుకోలేదు.
- కన్నెపెల్లి మండల తహసీల్దార్ కార్యాలయం చిన్నపాటి వర్షాలకే ఉరుస్తుంది. కార్యాలయంలో రికార్డు గది, ఆర్‌ఐ గది సైతం తేమ వచ్చి ఉరవడంతో ఇబ్బందులు పడుతున్నామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని భవనంలో కార్యాలయం కొనసాగుతుంది.
- వేమనపల్లిలో ఎంపీడీవో కార్యాలయం లోపల ట్రి పై కప్పుకు రేకులు మూడు సంవత్సరాల క్రితం గాలిదుమారంతో లేచిపోవడంతో వరండా మొత్తం వర్షనీరు చేరుతోంది. ఈ భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం, ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చే అధికారులు, ప్రజలు వర్షపు నీటిలో తడిసి లోపలికి వెళ్లాల్సి వస్తోంది.



శిథిలావస్థలో నెన్నెల పశువుల ఆసుపత్రి భవనం



తాండూర్ తహసీల్ కార్యాలయంలో..



ముత్యంపల్లి పశు వైద్యశాలలో పెచ్చులు ఊడుతూ..

అధ్వానంగా కార్యాలయాలు



కర్ణపేట ప్రాథమిక పాఠశాల భవనంలో...

దండేపల్లి: మండల కేంద్రంలోని పశువైద్యకేంద్రంతో పాటు, మండలంలోని చింతపల్లి పశు వైద్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు ఉరుస్తున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. సామగ్రి వర్షానికి తడిస్తోంది. మండలంలోని కర్ణపేట ప్రాథమిక పాఠశాల పూర్తి శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే విద్యార్థులకు సెలవివ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జన్నారం: ఇరిగేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. సోమవారం కార్యాలయానికి వచ్చిన రైతులు లోనికి వెళ్లకుండా, కార్యాలయాన్ని చూసి బయటనే ఉన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. వరండా పైకప్పు కూలింది. తరగతి గదుల పై పెచ్చులు ఊడిపడుతున్నవి.

పెచ్చులూడుతున్న జీజీహెచ్ శ్లాబ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని పాతభవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షపు నీరు గదుల్లోకి చేరుతుంది. వైద్యులు, వైద్య సిబ్బంది వర్షం కురిస్తే భయాందోళన చెందుతున్నారు. పాత భవనానికి పలుమార్లు మరమ్మతు చేస్తున్నా, ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడం లేదు. ఇటీవల నూతన భవనం నిర్మాణం కోసం మార్కెట్ కమిటీలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మెడికల కాలేజీ ఆవరణలో స్థలాన్ని కేటాయించి, సీఎం చేతుల మీదుగా నిర్మాణ పనులను ప్రారంభించినా, ముందుకు సాగడం లేదు.



జన్నారం: ఇరిగేషన్ కార్యాలయంలో...

శిథిల భవనాల కిందే విధులు

- చెన్నూర్ నియోజకవర్గంలో పాత ప్రభుత్వ కార్యాలయాలే దిక్కు



చెన్నూర్‌లో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

చెన్నూర్: నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉద్యోగులు శిథిలాల కిందే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అధ్వానంగా మారి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కొత్త భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు. అధికారులు, సిబ్బంది పాత భవనాలలోనే పనులు చేస్తున్నారు.

- చెన్నూర్ పట్టణంలో గల పశు వైద్యశాల, మండల విద్యాధికారి కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. భారీ వర్షాలకు గోడల్లో నీరు చేరుతుంది. ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో వర్షం కురిసిన సమయంలో ఉరవడం వల్ల రికార్డులు తడుస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయంలోని పలు గదుల్లో ఉరుస్తుండగా చెత్త సేకరించే బుట్టల్లో వర్షపు చుక్కలు పడేటట్లు ఉంచారు. అధికారులు ప్రమాదాలు జరుగకముందే స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు సూచిస్తున్నారు.

కుంగుతోంది..

జైపూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. భవనం ఒక పక్కకు కుంగిపోయి, శ్లాబ్ పెచ్చులు రాలుతున్నాయి. గతంలో పెచ్చులు ఊడి పడ్డ ఘటనలో అధికారులు గాయపడ్డ సంఘటనలూ ఉన్నాయి. వర్షపు నీరు ఉరుస్తుంది. ఉద్యోగులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.



చెన్నూర్‌లో ఎంఈవో కార్యాలయం...

వర్షం ధాటికి కూలిన ఇల్లు



కనకదుర్గాకాలనీలో కూలిన ఇల్లు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలటీ పరిధిలోని 2వ వార్డు కనకదుర్గాకాలనీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి ఆసంపల్లి అమృతకు చెందిన ఇల్లు సోమవారం కూలిపోయింది. సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన ఇంటిని కౌన్సిలర్ సుధాకర్, వీఆర్‌ఏ రాజు పరిశీలించారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని బాధితులకు తెలిపారు.

కూలిన పాఠశాల ప్రహరీ



మంచిర్యాలఅర్బన్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలింది. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, పాఠశాల ప్రహరీ పగులు తేలి ఉండటంతో వర్షానికి ఆదివారం రాత్రి నానిపోయి కూలిపోయింది. పక్కనే విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం.. గోడ లోపలి వైపు పడిపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



నస్పూర్: ప్రతీ కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 5 గనిపై కార్మికులకు రక్షణపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఏ-యాటిట్యూడ్, బీ-బిహేవియర్, సీ-కల్చర్, డీ-డిసిప్లేన్ సేఫ్టీ కల్చర్ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రామగుండ్ సింటాస్ ఇన్‌చార్జి శర్మ, శ్రీరాంపూర్ ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, గ్రూపు ఏజెంట్ ఏవి రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖా ధిర్, గ్రూపు ఇంజనీర్ వీరన్న, రక్షణ అధికారి శివయ్య, అధికారులు రణదీప్‌గౌడ్, రాధాకృష్ణ, ఎల్లయ్య, ప్రవీణ్, ఫిట్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

వీడని వాన...

జైపూర్: మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. రసూల్‌పల్లి పెద్దవాగు, పెగడపల్లి ఈదులాగు, టేకుమట్ల వద్ద పెద్దవాగు ఉధృతంగా ప్రవహించాయి. రాకపోకలకు ఆటంకం కలి గింది. భారీ వర్షంతో చెరువులు, కుంటల్లోకి భారీ వరద నీరు వచ్చి చేరింది. వేలాల వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో వేలాల పుష్కరఘాట్ నీట మునిగింది.

దండేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు 112.3మి.మీ. వర్షపాతం కురిసింది. పలు చోట్ల రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. నంబాలలో ఓ ఇంట్లోకి వరద నీళ్లు వచ్చి చేరాయి.



నంబాలలో ఓ ఇంట్లో చేరిన వరద

జన్నారం: మండలంలో వర్షానికి డ్రెయినేజీలు నిండి, వరదనీరు రోడ్లపై ప్రవహించింది. సాయిబాబ ఆలయం సమీపంలో, సినిమహాలు రోడ్డుపై ప్రధాన రహదారిపై వరద నీరు పారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

'కార్మికులపై నిర్లక్ష్యం తగదు'

జన్నారం: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం కార్మికుల సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. మురిమడుగులో ఇంటిపై నుంచి పడిన దూసముడి నర్సయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. శ్రీకాంత్ తండ్రి రామయ్య పంతులు అనారోగ్యంతో మృతి చెందగా, వారింటికి వెళ్లి పరామర్శించారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు మనోహర్, యోగేశ్వర్, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: మందమర్రి మండల కేంద్రంలో అనుమతి లేకుండా నవోదయ పేరుతో కోచింగ్ నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

విగ్రహాల ఏర్పాటు పనులు ప్రారంభం

భీమారం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భీమారం మండలకేంద్రంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్న అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాల ఏర్పాటు పనులను సోమవారం సర్పంచ్ గద్దె రాంరెడ్డితో పాటు స్థానిక నాయకులు ప్రారంభించారు.

ఘనంగా మండల పూజ

భీమిని: కన్నెపెల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో మహా మండలపూజ (41రోజులు)సోమవారం ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

నియామకం

భీమారం: మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన కందుగుల రమేశ్‌ను నియమిస్తూ సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియామక పత్రం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడేపు మహేష్ సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మహేష్‌కు ప్రేమ్‌సాగర్‌రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పుస్తకాల పంపిణీ

బెల్లంపల్లి: మండలంలోని అంకుశం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు.

శిక్షణ తరగతులు

నెన్నెల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్) తహసీల్దార్ భూమేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు హమీదు, భూమన్నలు బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు.

హెచ్‌ఎంగా లచ్చయ్య

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పానుగంటి లచ్చయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



జన్నారం: వేడుకల్లో ఎమ్మెల్యే రేఖానాయక్



మంచిర్యాలటౌన్ తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో...



ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసం వద్ద...

మంచిర్యాలటౌన్/రామకృష్ణాపూర్/జైపూర్/జన్నారం/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/తాండూర్/నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/ తాండూర్/నెన్నెల/లక్సెట్టిపేట: జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేశారు. మొక్కలు నాటారు. పండ్లు పంచి పెట్టారు. అన్నదానం చేశారు. జన్నారం మండలం పొనకల్ రైతువేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కార్యకర్తలు, నాయకులు, ప్రజల మధ్య కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. పలు చోట్ల మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, మాజీ చైర్‌పర్సన్ వసుంధర, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, కౌన్సిలర్లు పాల్గొనగా, నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య తెలంగాణ రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జన్నారంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, ఎంపీటీసీ రియాజోద్దీన్ పాల్గొన్నారు. చెన్నూర్‌లో ఎంపీపీ బాపు, జెడ్పీటీసీ తిరుపతి, చెన్నూర్, కోటపల్లి మండలాల వైస్ ఎంపీపీలు వెన్నపురెడ్డి బాపురెడ్డి, వాల శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఎంపీవో అజ్మత్ అలీ పాల్గొన్నారు. తాండూర్‌లో ఎంపీపీ ప్రణయ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, ఎంపీటీసీ సిరంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు. నెన్నెలలో ఎంపీటీసీ తిరుపతి, రామకృష్ణాపూర్‌లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, జైపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరవీందర్‌రావు, ఎంపీటీసీ లింగస్వామి, హాజీపూర్‌లో పూస్కూర్ రామ్మోహన్ రావు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, తాండూర్‌లో టీబీజీకేఎస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్: రక్తదానం చేస్తున్న నాయకులు



రక్తదానం చేసిన పూస్కూరి రామ్మోహన్‌రావు

రక్తదాన శిబిరాలకు స్పందన

మందమర్రిరూరల్/మంచిర్యాలటౌన్/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్వకుంట తారక రామారావు పుట్టిన రోజు సందర్భంగా బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. యువకులు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. హాజీపూర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బేర రామన్న, దేవి రాజయ్య, రామిల్ల బుచ్చయ్య, కంకణాల భూమయ్య రక్తదానం చేశారు. మందమర్రిలో ఏరియాలోని ఎంవీటీసీలో 82మంది రక్తదానం చేశారు.జిల్లా కేంద్రంలో పూస్కూరి రామ్మోహన్‌రావు తన నివాసంలోనే రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, తాను సైతం రక్తదానం చేశారు.

వ్యాసరచన పోటీలు

నస్పూర్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్య సమర యోధుల పాత్ర అంశంపై వ్యాస రచన, క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించారు.